# వాన వెలిసింది

- ఆర్. ఎం. చిదంబరం

విజయవాడ బస్‌స్టాండ్‌లో కాకినాడ వెళ్ళే బస్సు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నా. వారం రోజుల్లో మావయ్య కూతురు పెళ్ళి. అందుకే ఈ ప్రయాణం. ఉన్నట్టుండి ఎవరో వీపుమీద బలంగా చరిచారు. అదిరిపడి వెనక్కి తిరిగి చూశాను. ఆ వ్యక్తి ఎంతో పరిచయమైనవాడిలా కనిపించినా వెంటనే గుర్తుపట్టలేకపోయాను. అస్థిపంజరంలా వున్నాడు. కళ్ళు పాతాళాన్ని వెదుకుతున్నాయి. పెదవులమీద నవ్వులాంటిదేదో కనిపించినా దాని వెనక చీకటి తెర రెపరెపలాడుతున్న భ్రమ.

'రంగా!... నన్ను అప్పుడే మరచిపోయావా... కాలేజీలో ఒక క్లాసులో నాలుగు సంవత్సరాలు చదివి రెండున్నర సంవత్సరాలు నిరుద్యోగులుగా తిరిగి సిటీలోవున్న అన్ని పార్కుల్ని రోజుకు పదిసార్లు దర్శించేవాళ్ళం..' అని ఎడారిలో ఒయాసిస్సులా నవ్వాడు.

'అరి!... నీ... నువ్వు!... మైగాడ్!... రవణా!... ఎంతగా మారిపోయావురా?... ఎన్నాళ్ళకె న్నాళ్ళకు... ఉన్నట్టుండి ఇక్కడెలా ఊడిపడ్డావ్!...'

'అదంతా తీరిగ్గా మాట్లాడుకుందాం... ముందు హోటల్‌కు పోదాం పద' అన్నాడు.

ఆ తరువాత రవణ. గత ఆరేళ్ళలో తన జీవితం ఎలా పతనమైందో వివరంగా చెప్పాడు. ఓ పెద్ద ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో గుమస్తాగా పని చేస్తున్నాడట. రవణ ఓ మంచి రచయిత... పత్రికల్లో అతని కథలు తరచూ ప్రచురితమయ్యేవి.

* * *

ఆ రాత్రి ఒంటిగంటదాకా ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ గడచిన జీవితంలోని మధుర క్షణాలను నెమరువేసుకుంటూ గడిపాం. రవణ ఓ కవరు అందించి "ఓ కథ రాశాను. చదివి చూడు... దీన్ని కథ అనేకంటే నా జీవితంలో నేను ఎదుర్కొన్న ఓ విచిత్రానుభవం అంటే బాగుంటుంది.'

'సరే! నిద్ర ముంచుకొస్తోంది. రేపు చదువుతాను...' అన్నాను.

'కాదు... నువ్వు ఇప్పుడే చదవాలి. నీ అభిప్రాయం కావాలి. కథలో ఏవన్నా మార్పులు చేయాలంటే నీ సలహా అవసరం...' అని పట్టుబట్టాడు. 'ఇందులో మార్పులెలా వస్తాయి.? ఇది నీ జీవితంలో జరిగిన సంఘటన అన్నావు కదా!'

నా మాటలు చెవిటివాడి చెవిలో పాంచజన్య నాదం లాంటిది. ఇదుగో అతను రాసిన కథను, ఒక్క మాట కూడా మార్చకుండా ఉన్నదున్నట్టు వినిపిస్తాను. ఇంక చదవండి.

* * *

రైలు రామాపురంలో ఒక్క కుదుపుతో ఆగింది. ఆకాశం కారుమబ్బుల శాలువా కప్పుకుని, భీకరంగా గర్జిస్తోంది. కటిక చీకటి. మధ్య మధ్య మెరుపులు. చెట్లన్నీ పెనుగాలికి పైశాచిక నృత్యం చేస్తున్నాయి. రైలు రామాపురం చేరవలసిన సమయం సాయంత్రం మూడున్నర. అంటే నాలుగ్గంటలు లేటన్నమాట. ప్లాట్‌ఫారం మీద దీపాలు మిణుకుమిణుకు మంటున్నాయి. అంటే విద్యుచ్ఛక్తి ఇంకా ఖండించబడలేదన్నమాట. నా దగ్గరున్న లగేజీ ఓ చిన్న సూట్‌కేస్ మాత్రమే. రైలు దిగగానే లౌడ్ స్పీకర్‌లో ప్రకటన. 'కృష్ణానది ఉప్పొంగిపోయి రైలు పట్టాలు నీటి అడుగున మునిగిపోయాయి. అందుచేత రైలు ఎప్పుడు బయలుదేరుతుందో చెప్పలేం. ప్రయాణీకులకు కలిగిన ఇబ్బందికి మేం చింతిస్తున్నాం. ప్లాట్‌ఫారం వెండర్స్ వీలైనంతవరకూ మీక్కావలసిన తిను బండారాలు, కాఫీ, టీ అన్నీ ఇవ్వగలరు. మీకేదన్నా సాయం కావాలంటే స్టేషన్ మాస్టర్‌గార్ని కలవండి' అదీ ఆ ప్రకటన సారాంశం.

'బ్రతుకు జీవుడా!... మా వూరు దాకా లాక్కొచ్చావు - ధన్యుణ్ణి.' అని నన్ను నేనే అభినందించుకున్నా. ఇంతలో ఊళ్ళో ఉన్న యువక బృందం బజ్జీలు, పకోడీలు, చపాతీలు,

పాలు తీసుకొచ్చి ప్రయాణీకులకు ధైర్యం చెప్పారు.

ఇంట్లో నా కోసం ఎదురుచూసే వాళ్ళెవరూ లేరు. ఒంటరి బ్రతుకు. అందుచేత రైల్లో ఇతర ప్రయాణీకులు ఎలా వున్నారో చూద్దామని ఇంజను దాకా నడవ సాగాను. మూడు కంపార్టుమెంట్లు దాటాక ఛటుక్కున ఆగిపోయాను. నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. సుశీల కిటికీ వారగా కూర్చుని వెలుగులేని శూన్యంలోకి చూస్తోంది.

'సుశీ!'

సుశీల అదిరిపడింది. గుడ్డి వెలుతురులో నన్నోమారు ఆపాదమస్తకం పరీక్షగా చూసి నేనెవర్నో నిర్ధారణ చేసుకున్న తరువాత 'బావా!... నువ్వా?... ఇక్కడ...?

'అవును సుశీ! నేను ప్రస్తుతం ఈ వూళ్ళోనే వుండేది. నన్ను ఏడాది క్రితం ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ చేశారు కదా!... అరె!... మతిమరుపు... నేనెక్కడున్నానో అసలు బ్రతికున్నానో లేదో... అనే సంగతి కూడా నీకు తెలిసే అవకాశం లేదు. ఏనాడో తెగిన బంధం. మరి ఎక్కడకు వెడుతున్నావు?... అదీ ఒంటరిగా వెంట ఎవరూ లేనట్టుందే!

'అవును బావా! ఆయన విశాఖలో ఉన్నారు. బంధువుల అమ్మాయి పెళ్ళికి విజయవాడ వెళ్ళాను. ఉన్నట్టుండి ఆయనకు హార్ట్ అటాక్ వచ్చింది. వెంటనే రమ్మని ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది. ఆదరాబాదరాగా బయలుదేరాను.'

'మీ ఆయనకి ఇప్పుడెలా వుంది?'

'ఫరవాలేదు. ఆపద నుంచి బయట పడ్డారు. విశ్రాంతి తీసుకుని జాగ్రత్తగా వుండాలన్నారు. భయపడనక్కర్లేదు... దరిద్రపు రైలు... నాలుగ్గంటలు లేటు...' అని విసుక్కుంది.

'అంటే నువ్వు లౌడు స్పీకర్‌లో ప్రకటన వినలేదన్నమాట...'

'ఏముంది వినటానికి? ఈ రైలు అయిదు నిమిషాల్లో బయలుదేరుతుంది. లేకపోతే గేటు దగ్గర చూపించటానికి టిక్కెట్లు రెడీగా వుంచుకోండి.

రొటీన్ అనౌన్స్‌మెంట్!... అంతేగా!...'

నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

'అది కాదు సుశీ!...' అని సంగతి వివరించాను.

'అమ్మనాయనోయ్!... మరి ఈ రాత్రంతా ఈ రైల్లోనే గడపాలా?

ఆయన్ని గురించి ఆలోచించి కృంగిపోతున్నా.... పుండు మీద కారం చల్లినట్టు..."

ఈ రాత్రే కాదు మరో రెండురోజులు ఈ ప్లాట్‌ఫారం మీద గడపాల్సి వస్తుందేమో ఎవరికి తెలుసు? ఉప్పొంగిన నది ఎప్పుడు దయతల్చి అణగిపోతుందో... అదీ గాక కుండపోతగా వర్షాలు శరవేగంతో వస్తున్నాయి.' నేను ఆలోచనలో పడ్డాను.

సుశీ! ఈ కాళరాత్రిలో, చీకటిలో ఈ కంపార్టుమెంటులో రాత్రి గడపటం వేదనా భరితం... దుస్సాహసం... నువ్వు ఓ అందమైన దానిని... నువ్వు అపార్థం చేసుకోకపోతే నా ఇంటికి వచ్చేయి. ఈ మెరుపుల ఆక్రమణ చూస్తుంటే దీపాలు కూడా వుండవు. త్వరగా ఓ నిర్ణయానికి రావటం మంచిది.' అని నచ్చచెప్పాను.

ఓ రెండు నిమిషాలు మౌనం...

సూట్‌కేస్ తీసుకుని బండి దిగింది.

ఇద్దరం మౌనంగా నడవసాగాం. గాలివేగం ప్రతి నిమిషానికి ఎక్కువవుతూ వచ్చింది. మేము ఇద్దరం గగన యాత్రీకులమౌతామన్న భయం.

తలుపు తెరచి స్విచ్ ఆన్ చేశాను.

గదంతా పుస్తకాలతో, పేపర్లతో, మాసిపోయిన బట్టలతో చిందరవందరగా వుంది.

'బావా! అక్కయ్యపోయిన తరువాత నువ్వు మళ్ళీ పెళ్ళిచేసుకోలేదా?...

వృథాగా నీ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావు. గతానికీ నీకూ మధ్య ఇనుప తెర నిర్మించుకో'

సుశి మాటలు నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాయి.

'ఒకవేళ నీ మొగుడు కనక గుటుక్కుమంటే నన్ను పెళ్ళిచేసుకుంటావా! నాలుక చివరదాకా వచ్చిన ఆ ప్రశ్న సుశీల గనక విని వుంటే తిరిగి స్టేషన్‌కి పరుగెత్తి రైలు పెట్టెలోనే రాత్రంతా



గడిపేది.

'ఏవిటి! దీర్ఘాలోచనలో పడ్డావ్ బావా?'

నా కెదురుగా వున్న నా భార్య ఫోటో వంక చూస్తున్నా. చందనహారంలో భావగర్భితంగా నవ్వింది. ఏవిటో... పిచ్చి పిచ్చి ఆలోచనలు. అర్థరహితమైన భావపరంపరలు.

'సుశీ!... కరెంట్ ఏ క్షణంలోనైనా పోవచ్చు. ఇప్పుడైతే గీజర్‌లో వేణ్ణీళ్ళు వస్తాయి. వెళ్ళి స్నానం చేసిరా. నేను ఏదైనా వండుతాను!

'ఎందుకీ తంటాలు బావా!... చక్కగా మరో పెళ్ళి చేసుకుంటే ఈ బాదరబందీ వుండదు. యాభై సంవత్సరాలు దాటిన వాళ్ళు కూడా చిన్నపిల్లాడు ఐస్‌క్రీం కోసం నోరు చప్పరించినట్టు ఏ ఆడదాని మెళ్ళోనైనా పుస్తె కడతాడు. నీకు ముప్పై ఏళ్ళు కూడా నిండలేదు. చూట్టానికి బాగున్నావు. మంచి ఉద్యోగం వుంది.' అని నిండుగా అర్థోక్తిగా నవ్వింది. పెనుగాలికి కిటికీ తలుపులు గుండెలు బాదుకున్నాయి. సుశీల కిటికీ తలుపులు మూసి గొళ్ళెం పెట్టింది.

'నేనెందుకు రెండో పెళ్ళి చేసుకోలేదో చెప్పమంటావా?'

ఎందుకన్నట్టు కనుబొమ్మలెగరేసింది.

'నీ లాంటి అందమైన, గుణవంతురాలైన అమ్మాయి దొరకనందువల్ల...' అన్నాను తెగించి.

'నీ మొదటి కాంప్లిమెంటు బాగానే వుంది. స్వీకరిస్తున్నా... నేను గుణవంతురాలినని ఎలా చెప్పగలవు?'

నేను అయోమయంగా తెల్లమొహం వేసి ఆమెకేసి తీక్షణంగా చూశాను. సుశీల విరగబడి నవ్వింది.

* * *

స్నానం చేసి గులాబీరంగు చీర కట్టింది. చెవులకున్న దుద్దులు గులాబీరంగు - మెళ్ళో గులాబీ రంగు పులుముకున్న ముత్యాలహారం. అంతదాకా ఎందుకు? అప్పుడే విచ్చిన పువ్వులా వుంది. నేను కొన్ని క్షణాలు ఆమెకు రెప్పవాల్చకుండా చూశాను.

'ఏం బావా?... నమిలి మింగేస్తున్నట్టు అలా చూస్తావ్?' అని అన్ని సుగంధాల సౌరభం మూర్తీభవించి ముంచివేసినట్టు నవ్వింది.

'నేనేం పెద్దపులిని కాను... కేవలం రసికుణ్ణి... అందాన్ని ఎవరైనా చూసి ఆనందించవచ్చు. నిజానికి దేవుడు తన సృష్టిలో సౌందర్యానికి ప్రాధాన్యమిస్తూ పంచరత్నాల్లా దాన్ని వెదజల్లాడు. అందులో స్త్రీలు అగ్రతాంబూలం తీసుకుంటారు.'

'ఎంత చక్కగా మాట్లాడుతున్నావ్ బావా!... మా అక్క నిజంగా దురదృష్టవంతురాలు... ఎప్పుడైనా కలలో కనిపిస్తుందా?...'

'సరే!.. రెడీ మిక్స్‌లు ఫ్రిజ్‌లో వున్నాయి. కడుపులో మండుతున్న ఈ దావాగ్నిని చల్లబరచాలి మరి...'

'ఉత్తుత్తతిండితోనా?...' అని సుశీల మళ్ళీ నవ్వింది.

ఆమె నవ్వును నూటిగా ఎదుర్కోలేకపోయాను... అంతేకాదు. కోర్కెతో రగిలిపోతున్న ఆ నేత్రాలు?...

* * *

కరెంటు ఎప్పుడో ఖండించబడింది. రేడియం డయలు వాచీ చూసుకున్నా. పన్నెండు దాటింది. నాకు నిద్రపట్టటంలేదు. గతంలోకి కాస్త తొంగి చూశాను. పెళ్ళి చూపులకు శారదను చూడ్డానికి నేనూ మావయ్యా వెళ్ళాం. అప్పుడే సుశీలను చూశాను. శిరీష పుష్పం గురించి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో వర్ణించాడు. సుశీల అచ్చం ఆ పుష్పంలాగే వుంది. శారదేమో సంపెంగ పూవు. ప్రకృతిలో ఒక అందమైన వస్తువును మరో అందమైన వస్తువుతో పోల్చకూడదన్నారు. దేనికదే పర్వత శిఖరం లాంటిది. కాని సుశీల చిరునవ్వు... ఏవో కొండలూ, లోయలూ, జలపాతాలూ ఇమిడివున్నట్టనిపించాయి. ఆమె చూపులో నవరసాలు నిండివున్నాయి. సుశీలనే చేసుకుంటానని మావయ్య చెవిలో రహస్యంగా అన్నాను.

'ఆ సంగతి నాకు వదిలేయి. నేను చూసు కుంటాను.' అన్నాడు. మావయ్యను ఎదిరించే శక్తి నాకు లేదు. అమ్మ, నాన్న చిన్నప్పుడే పోయారు. నన్ను పెదచేసి చదివించి ఉద్యోగం ఇప్పించిన వాడు మావయ్య. నన్ను ఓ ఇంటివాణ్ణి చేసే అధికారం కూడా ఆయనకుండటం సమంజసం.

శారదతో నా పెళ్ళి జరిగిపోయింది. నేను భర్తగా, పోషకుడిగా నా కర్తవ్యాన్ని శక్తివంచన లేకుండా నిర్వహించాను. ఉన్నట్టుండి ఏదో మాయరోగం వచ్చి శారద శాశ్వతంగా కన్ను మూసింది. ఆ తరువాత చీకటికి అలవాటుపడి పోయాను. వెలుగంటే ఏమిటో మరచిపోయాను.

పక్కగదిలోకి తొంగిచూశాను. అలా చూడటం తప్పే. నిద్రపోయిందా లేదా చూద్దామని... అంతే అంతరాత్మ ఎందుకో విచిత్రంగా నవ్వింది.

'బయట వర్షం విజృంభిస్తోంది. కంబళి... శాలువా... ఏదన్నా కావాలా సుశీ!

'అక్కర్లేదు బావా! కావలిస్తే అడుగుతాలే!' అంది.

కొవ్వొత్తి వెలిగించి సుశీల గదిలో ఒకటి, నా గదిలో ఒకటి పెట్టుకున్నా. గుడ్డిలో మెల్ల

సగటు మనిషికి కొన్ని నిశ్చితాభిప్రాయాలు, నైతిక నిబంధనలు వుంటాయి. సాధారణ పరిస్థితుల్లో వాటిని ఉల్లంఘించటానికి సాహసిం చరు. ఉదాహరణకు రోడ్డుమీద ఓ పర్సు పడుంద నుకోండి డబ్బున్న వ్యక్తి ఎలాగైనా దాన్ని పోగొట్టకున్న వ్యక్తికి అప్పగించటానికి ప్రయత్నిస్తాడు. ఇక్కడ అంతరాత్మ హితబోధను తు.చ. తప్పకుండా ఆచరిస్తాడు. డబ్బుకు నానా యాతనా పడుతున్న అదే సగటు మనిషి ఎవరూ చూడని సమయం చూసి చటుక్కునదాన్ని అపహరించి తన బాగుకోసం సద్వినియోగం చేసుకుంటాడు. అలాగే అందమైన అమ్మాయి ఎదురుపడితే సౌందర్యాన్ని చూసి ఆనందించి తృప్తిపడి వెళ్ళిపోతాడు. మరి ఇప్పుడు నేను చిక్కుకున్న వాతావరణ వలయం నన్ను 'అవినీతి'కి ప్రోత్సహిస్తోంది. దీన్ని 'అవినీతి' అనటానికి మనసు ఒప్పుకోవటంలేదు. అయినా నిప్పుకు దూరంగా వుండాలని ప్రయత్నిస్తున్నా... సుశీల పరోక్షంగా విసిరిన మాటలకు రకరకాల అర్థాలు కల్పించుకుని ఏం చేయాలో తోచక అయోమ యంగా చూస్తూ కూర్చున్నా. శూన్యంలో నక్షత్రాల వెలుగు కనిపిస్తోంది. వేడిలో చల్లదనం వెచ్చగా తగులుతోంది. పరిస్థితులకు బానిసై మనిషి నైతికంగా దిగజారటం సర్వసాధారణం.

అంతరాత్మ నోరుమూసి చీకటి గదిలో బంధిం చటం తప్ప వేరే మార్గం లేదు. నా ఆకాంక్షకు తోడుగా ఒమర్ ఖయ్యాం ఫిలాసఫీ... 'నిన్న' చనిపోయింది. 'రేపు' ఇంకా పుట్టలేదు. 'వర్త మానం' మాత్రమే నిజం మిగిలినవన్నీ ఊహా కల్పితాలు'

వాచీ చూసుకున్నా... ఒంటిగంటైంది.

సుశీల గదిలోకి మళ్ళీ తొంగి చూశాను.

'ఏం బావా!... నీక్కూడా నిద్రపట్టడంలేదా?... నిజంగా ఈ రాత్రి ఎలా గడుస్తుందో తెలియదు. భయం భయంగా వుంది. ఇలా వచ్చి కూర్చో - ఏవైనా కబుర్లు చెప్పుకుందాం' అంది.

ఆమె ముందు కుర్చీ వేసుకుని కూర్చున్నా. సుశీల మంచం మీద లేచి కూర్చుంది. 'బావా!... నీకు అంతో ఇంతో జ్యోతిష్యం తెలుసని అక్క చెప్పింది. నా చెయ్యి చూసి నా భవిష్యత్తు వివరించు' అని చెయ్యి చాపింది.

గుండె జెట్ వేగంతో కొట్టుకొంటోంది. మా ఇద్దరి శరీరాలు దూరంగా వున్నా ఏ విద్యుల్లతో అల్లుకుపోయిన భావన - భూమి తన చుట్టూ తాను తిరగటం మానేసింది. ఆ చీకటిలో వంద సూర్యులు ఉదయించిన భ్రాంతి కలిగింది. కొద్దో గొప్పో హస్త సాముద్రికం నేర్చుకున్నా. ఏం చెప్పాలో అర్థం కాలేదు. ' ఏం బావా! మై ఫ్యూచర్?' అంది భుజాలు కుదుపుతూ. అంతే! పంచమహాసముద్రాలు మమ్మల్ని ముంచివేశాయి. ఎవరెస్టు శిఖరం మంచులా కరిగి నేల కొరిగింది. ముందుగానే ఒప్పందం చేసుకున్నట్టు రెండు కొవ్వొత్తులు ఒక్కసారిగా ఆరిపోయాయి. ఎవరికీ కనిపించని చందమామ నాకు మాత్రం తెరవెనక నుంచి కిసుక్కున నవ్వుతున్నట్టు కనిపించింది. సుశీలా, నేనూ ఆలింగనంలో సతమతమై పోయాం. దేనికోసమో వెతకటం అధరాలు, చెంపలు... ఇంకా... ఏవిటో... ఏవిటో... వర్ణించలేని అనుభూతి. భళ్ళున చప్పుడు.

శారద ఫోటో కిందపడి పగిలింది. గాజుముక్కలు ఎగిరివచ్చి మీదపడ్డాయి. సుశీలా హఠాత్తుగా నన్ను విదిలించుకుంది.

'ఒద్దు బావా!... అక్కయ్య అన్నీ చూస్తోంది. అదీ కాక మా ఆయనకు ఏమన్నా అయితే?..' అంటూ లేచివెళ్ళి కొవ్వొత్తి వెలిగించింది. 'ఈ వెలుగు మనకు మార్గదర్శకంగా వుండాలి. నీ గదికి వెళ్ళు' అంది.

* * *

మర్నాడు ఉదయం మబ్బులు మటుమాయమై నిర్మలాకాశం నీలిరంగులో, చిరునవ్వుతో సూర్యు డికి స్వాగతం పలికింది. స్టేషన్‌కి వెళ్ళివచ్చాను. కృష్ణానది నీటిమట్టం బాగా తగ్గిందని, రైలుపట్టాలు సరిగా వున్నాయని, రైలు రెండుగంటల్లో బయలుదేరుతుందన్నారు.

రైలు కదులుతుంటే 'వస్తాను బావా!... నా సలహా విని మళ్ళీ పెళ్ళిచేసుకో' అంది.

'మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావు?' ఏదో అనాలికదా అని ఆ ప్రశ్న వేశాను. 'ఇంక మనం కలుసుకోకుండా వుంటే ఇద్దరికీ మంచిది.'

మళ్ళీ అదే నవ్వు. అదే చూపు. ఓ చిన్న కాగితం అందించింది.

'రైలు ప్లాటుఫారం దాటాక చదువుకో... ఇప్పుడు కాదు.' అంది.

కాగితం జేబులో భద్రపరిచాను. ఏం రాసుంటుంది. 'నన్ను క్షమించు' అని రాసి వుంటుంది.

రైలు బరువుగా బయలుదేరింది.

* * *

'ఎలా వుంది కథ?' అని రవణ అభిప్రాయం అడిగాడు.

'కాళరాత్రిలో ఒకరిలో ఒకరు ఐక్యమైపోవ టానికి సిద్ధంగా వున్న సమయంలో నీ సుశి నిన్ను గెంటివేసిందంటే నేను నమ్మలేకుండా వున్నాను. ఆటం బాంబు పగలబోతుంటే మలయమారుతం వీస్తోంది. రకరకాల పుష్పాలు సౌరభాన్ని వెదజల్లు తున్నాయి. ఆఘ్రాణించి ఆనందించు...' అన్నట్టుగా వుంది. ఇది నాకు నాచురల్‌గా కనిపించటం లేదు.'

రవణ జవాబివ్వలేదు. ఇక్కడ ఓ విషయం చెప్పాలి. రవణ ఎప్పుడూ అబద్ధమాడడు. ఉన్నదున్నట్టు కుండ బద్దలు కొట్టినట్టుగా మొహంమీద అనేస్తాడు. అందుకనే సూటిగా ఆ

ప్రశ్న వేశాను. జవాబు కోసం ఎదురు చూస్తుంటే నా ప్రియమిత్రుడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. బాగా అలసిపోయుంటాడు.. అతన్నెందుకు డిస్టర్బ్ చేయాలి? తెల్లవారకపోతుందా ఏవిటి?

* * *

మర్నాడు ఉదయం రైలు ఎనిమిది గంటలకు. మెలకువ వచ్చింది ఏడు గంటలకు. ఆదరా బాదరాగా రైల్వే స్టేషన్ చేరుకున్నాం. అప్పటికే రైలు వచ్చి ప్లాటు ఫారం మీద అలసట తీర్చుకుం టోంది. రవణకు కిటికీ వారగా సీటు దొరికింది.

'మరి నా ప్రశ్నకు జవాబు?...'

రవణ పెద్దగా నవ్వాడు. రైలింజను కూతలో ఆ నవ్వు కలిసిపోయింది. రైలు బయలుదేరింది. చేతిలో ఓ చిన్న కాగితం పెట్టాడు.

'సుశీల రాసింది. చదువుకో...' అన్నాడు. అప్పటికే రైలు ప్లాట్ ఫారానికి 'టాటా' చెప్పి కదిలిపోయింది.

ఆ కాగితం చదువుకున్నా. నాలుగు పంక్తులు.

'మా ఆయనకు హార్ట్ ఎటాక్ ఏవిటి బావా?... అసలు నాకు పెళ్ళే కాలేదు'.

...నువ్వన్నట్టు నీలాంటి మగాడు దొరికితే తప్పకుండా పెళ్ళిచేసుకుంటాను అంతవరకూ బై...బై...'

రవణ మళ్ళీ కనిపిస్తాడన్న నమ్మకం నాకు లేదు. కనక నా ప్రశ్న ప్రశ్నగానే నిలిచిపోయింది.

○

## మినీ కవితలు

### లొసుగులు

వ్యవస్థలో... సలసల కాగే
అవస్థల ఆవిరులు...
జలజల రాలే నా అశ్రువులు

### పేపర్ బాయ్

ప్రపంచ పరిజ్ఞానాన్ని
ప్రాతఃకాలంలో
ప్రజల ముంగిట్లోకి 'కొని'తెచ్చే
పరివ్రాజకుడు.

*- శిల్పా జగదీష్.*

## స్త్రీలకు దేవుడి శాపం

**చా**లా చాలా పూర్వకాలంలో దేవుడు ఒకప్పుడు ఒకపని మీద ఎవరినో పంపాలను కున్నాడు. ఆ పని స్త్రీలకు ఆయన పురమాయిం చాలనుకున్నాడు. కాని, పాపం అప్పటికే స్త్రీలు ఇంటిపనులతో తలమునకలై ఉన్నారు. "త్వరగా రండి! మీకో కొత్తపని పురమాయిస్తాను" అని దేవుడు వారిని పిలిచినప్పుడు వారిలా అన్నారుః "ఒక్క క్షణం ప్రభూ! చేతిలో పని పూర్తికాగానే వచ్చేస్తాం." దేవుడు కాసేపాగి మళ్ళీ పిలిచాడు. "పని పూర్తికావచ్చింది. వచ్చేస్తున్నాం! ప్రభూ!" అన్నారేగాని అప్పటికీ స్త్రీలు తెమలి రాలేదు.

ఆ కాలంలో పాలు తియ్యడం, ఇళ్ళు కట్టుకోవడం, కట్టెలు కొట్టి తెచ్చుకోవడం లాంటి పనులన్నీ స్త్రీలే చూసేవారు. పురుషులు చేసే ఒకే ఒక పని ఇంటిచుట్టూ కంచె వెయ్యడం. పశువులకు ఏ ఆపదా రాకుండా కాపాడడం - అంతే! వారికెంతో తీరిక ఉండేది. అందుచేత వారు పరుగెత్తుకుంటూ వచ్చి దేవుడితో "ఆ పనేదో మాకు పురమాయిం చండి ప్రభూ! మేము చేస్తాం" అన్నారు. స్త్రీల మీద దేవుడికి కోపం వచ్చి ఆయన వారిని ఇలా శపించాడటః "మీ పనులు ఏ ప్రొద్దుకీ తెమలకుండా ఉండుగాక! ఒక పని పూర్తికా గానే ఎప్పటికప్పుడు మరో పని ఎదురుచూస్తూ ఉండుగాక! నేను పిలవగానే వచ్చారు గనుక పురుషులకు మాత్రం విశ్రాంతి లభించుగాక! చనిపోయే ఘడియదాకా క్షణం కూడా స్త్రీలకు తీరికా, విశ్రాంతి లేకుండుగాక!" అని శపించాడు.

పాపం ఆ క్షణం నుండి ప్రపంచంలో ప్రతి స్త్రీకి ఒక చెల్లిగా, ఒక అక్కగా, ఒక భార్యగా, ఒక తల్లిగా, ఒక అత్తగా చివరి క్షణం వరకూ తీరిక లేకుండా శ్రమిస్తూ తమ జీవితాలను పరులకి ధారపోస్తున్నారు.

(ఉత్తర కెన్యాలోని 'గారీ' జానపద కథ ననుసరించి...)

*-మామిడి మహేంద్ర.*